

ఆయన కార్టూన్లు.. యువతకు స్ఫూర్తి
- కార్టూనిస్టుగా రాణిస్తున్న విజయ్‌కుమార్ 6

ఆర్‌జీ-1లో 98శాతం బొగ్గు ఉత్పత్తి
- జీఎం లలిత్‌కుమార్ 8

న్యూస్ బాక్స్

రామగుండం సీపీని కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రామగుండం సీపీ శ్రీనివాస్‌ను బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ బంగ్లాస్ ఏరియాలోని సీపీ నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు రామగుండం నియోజకవర్గంలో శాంతిభద్రతలపై చర్చించారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని చర్చించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కాల్వ లింగస్వామి, ఫక్రుద్దీన్, ముస్తాఫా, పాతిపెల్లి రవి, తాళ్లపల్లి యుగంధర్ ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

మంథని, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంథని ఆర్టీసీ డీఎం శ్రవణ్‌కుమార్, పెద్దపల్లి ఏఎంవీఐ వంశీకృష్ణలు సూచించారు. స్థానిక డిపోలో బుధవారం జరిగిన ప్రమాదరహిత మాసోత్సవాల్లో వారు మాట్లాడుతూ.. మంథని ఆర్టీసీ డిపోను జీరో అక్సిడెంట్ ఫ్రీగా ఉండటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇదే విధంగా ఈఏడాది కూడా ప్రమాదాలు చోటు చేసుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్ శ్రీనివాస్, ఆర్‌హెచ్‌సీ వెంకటేశ్వర్లు, ఎస్‌డీఐ గోపాల్, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

నియామకం

కళ్యాణ్‌నగర్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా సర్జరీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్‌ను నియమిస్తూ బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. జీజీహెచ్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్ పదవీ బాధ్యతలు నిర్వహించనున్నారు.

టీబీ రహిత సమాజానికి కృషి


పెద్దపల్లి రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : క్షయ రహిత సమాజాన్ని సాధించేందుకు కృషిచేయాలని రాఘవపూర్ పీహెచ్‌సీ వైద్యురాలు మమత అన్నారు. మండలంలోని రాఘవపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రభుత్వం చేపట్టిన నిక్షయ్ శిబిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిబి యూనిట్ సీనియర్ చికిత్స పర్యవేక్షకులు దేవ తిరుపతి, నోడల్ పర్సన్ తిరుపతమ్మ, విమల, సునిత, ఆశ కార్యకర్తలు అనిత, వరలక్ష్మీ పాల్గొన్నారు.

పే స్కేల్ అమలు చేయాలి

పెద్దపల్లి రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికి ప్రభుత్వం పేస్కేల్ అమలు చేయాలని జాక్ అధ్యక్షుడు తిప్పని తిరుపతి డిమాండ్ చేశారు. పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. కుంభాల సుధాకర్, రవిరాజ్, రాజ్‌కుమార్, సంధ్యారాణి, సంపత్, రహీమొద్దిన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల నియామకమెప్పుడో..?

- పెండింగులో మంథని, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీలు
- ఎదురుచూస్తున్న ఆశావహులు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మంథని నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీల నియామకాల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ఇంకా పాలకవర్గాలను ఖరారు చేయలేదు. దీంతో అధికార పార్టీకి చెందిన నాయకులు కలవ రానికి గురవుతున్నారు. జిల్లాలో మొత్తం 8 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇప్పటివరకు పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, జూలపల్లి, ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకాలు పూర్తయ్యాయి. రెండు రోజుల క్రితం రామగుండం మండలంలోగల మార్కెట్ కమిటీ పాలకవర్గం కూడా ప్రభుత్వం ఖరారు చేసింది. కానీ మంథని నియోజకవర్గంలోని మంథని, కమాన్‌పూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలు ఖరారు కాకపోవడంతో ఆ పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఈ మార్కెట్ కమిటీల పాలకవర్గాలు ఎప్పుడో ఖరారు కావాల్సి ఉండగా జాప్యం జరుగుతున్నది. గత ప్రభుత్వ హయాంలో నియమించిన మార్కెట్ కమిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసింది. వాటికి సంబంధించిన ప్రక్రియ కూడా మార్చి, ఏప్రిల్ నెలలోనే పూర్తయింది. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మా రం మండల కేంద్రంలోగల వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం ఆగస్టు మాసంలోనే పూర్తయింది. అలాగే పెద్దపల్లి నియోజకవర్గంలోని కమిటీలను కూడా పూర్తిచేశారు. ఇటీవల రామగుండం కమిటీ పూర్తికాగా, మంథని, కమాన్‌పూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకాలు జరగకపోవడంతో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

● నేతల పోటాపోటీ..

మంథని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దుద్దిల్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఆయన ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉండడంతో తన నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీలను ఖరారు చేసే విషయంలో జాప్యం జరుగుతున్నట్లుగా తెలుస్తున్నది. మంథని, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులను ఓసీ జనరల్ కేటగిరికి చెందినవారికి రొటేషన్లు రిజర్వ్ కావడంతో నేతల మధ్య పోటీ ఎక్కువయ్యింది. మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం ముస్కుల సురేందర్‌రెడ్డి, మూల పురుషోత్తంరెడ్డి, శశిభూషణ్ కాచే, కుడుదుల వెంకన్న, శ్రీరాంభట్ల శ్రీనివాస్ తదితరులు పోటీపడుతున్నారు. కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఇనుగంటి భాస్కరరావు, ఇనుగంటి రామారావు, పీట్ల గోపాల్, గంట వెంకటరమణారెడ్డి, మైనాల రాజు, సయ్యద్ అన్వర్, జబ్బర్‌ఖాన్, ఆరెల్లి కొమురయ్యగౌడ్ తదితరులు పోటీ పడుతున్నారు. మంత్రి ఆశీస్సులు ఎవరికి

మిగతా 8లో

ప్రతిపక్షాల ఆరోపణలకు అభివృద్ధే సమాధానం

- ఆరు నెలల్లో మార్పు కనిపిస్తుంది - రూ.300కోట్లతో అభివృద్ధి పనులు - రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రామగుండంలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తాము చేస్తున్న అభివృద్ధే జవాబు అని, పనులు మొదలయ్యాయని, ఆరు నెలల్లో మార్పు ఏమిటో స్పష్టంగా క్షేత్రస్థాయి కనిపించనున్నదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులకు రామగుండంలో చేస్తున్న అభివృద్ధి పనులు కనిపించడం లేదని, వారిని కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి చూపిస్తానన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాత ఏడాదిలో రూ.300కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు, కార్పొరేషన్ పరిధిలో 50డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని, రామగుండంలో ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో 3/800 2400మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు, రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రంను తీసుకురానున్నట్టు చెప్పారు. మెడికల్ కళాశాల తాము తీసుకువచ్చామంటూ బీఆర్ఎస్ నాయకులు గొప్పలు చెబుతున్నారని, సింగరేణి కార్మికుల చెమట చుక్కల సొమ్ముతోనే మెడికల్ కళాశాల నిర్మాణం జరిగిందని, ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదన్నారు. రామగుండానికి ఈఎస్ఐ ఆసుపత్రి అప్పటి ఎమ్మెల్యే నిర్లక్ష్యం వల్లనే వెనకకు వెళ్లిపోయిందని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి మళ్లీ మంజూరు చేయించామని, రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. రామగుండంలో 350కోట్లతో పాలకుర్తి ఎత్తిపోతలను ప్రతిపాదించామని, దీని వలన ఉమ్మడి రామగుండం మండలంతో పాటు కమాన్‌పూర్, పెద్దపల్లి మండలాల్లో కొన్ని ప్రాంతాలకు మూడు పంటలకు నీరందే అవకాశం ఉందన్నారు. బండలవాగు ప్రాజెక్టు పూర్తి కావచ్చిందని, త్వరలోనే ముఖ్యమంత్రి కానీ, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా కానీ ప్రారంభిస్తామన్నారు. సుందిళ్ల బ్యారేజీలో నీటి నిల్వలు ఉంచి ప్రపంచానికి కాళేశ్వరంతో నీళ్లు తెచ్చామని చూపేందుకు గత ప్రభుత్వ పెద్దలు ప్రయత్నించారని, దీంతో భారీ వరదలకు గోదావరిఖని, మంచిర్యాల మునిగాయన్నారు. గతంలో కరకట్ట ప్రతిపాదనలే లేవని, దీని పట్ల దుష్ప్రచారం చేశారన్నారు. గతంలో పని చేసిన ఇంజనీర్లే ఇప్పుడు ఇరిగేషన్‌లో ఉన్నారని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను వర్షాకాలంలో తగ్గించుకుంటే కరకట్టలు అవసరం లేదని చెబుతున్నారన్నారు. మంచిర్యాల, చెన్నూరుల్లో కరకట్టలు కడితే రామగుండంలో కడతారన్నారు. రామగుండంలో కబ్జా అయిన సింగరేణి భూములను విడిపించి షాపింగ్ కాంప్లెక్స్‌లు కడదామని ప్రయత్నిస్తుంటే విపక్ష నాయకులు అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని, రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో షాపింగ్ మాల్, జేఎన్‌టీయూ నుంచి ఫోర్ లైన్ రోడ్డు, రామగుండంలో ఫ్లై ఓవర్‌పై కుడివైపు రైట్ ఆర్మ్ వంతెన నిర్మాణం చేయనున్నామన్నారు. తద్వారా నగరంలో వ్యాపారం అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి కలుగనున్నదన్నారు. మంచిర్యాల, సిద్దిపేటలను చూసి అయినా ఇక్కడి ప్రతిపక్షాలు నోరుమూసుకోవాలన్నారు. రామగుండంలో చెప్పని పనులను చేసి చూపించామని, రాబోయే రోజుల్లో కూడా అదే విధానం కొనసాగుతుందన్నారు. రామగుండం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రామగుండంలో డెంటల్ కళాశాలను కూడా తీసుకురానున్నామన్నారు. తద్వారా ఈ ప్రాంతాన్ని మెడికల్ హబ్‌గా మారుస్తామని, ఈ ప్రాంతంలో వ్యాపారాలు పెరిగి ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, మారెల్లి రాజిరెడ్డి, ఎం రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, ముస్తాఫా, దీటి బాలరాజు, గుండేటి రాజేష్, గడ్డం శ్రీనివాస్, ఫజల్ బేగ్ పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



గోదావరిఖనిలో చౌరస్తాను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పాత సంవత్సరానికి బైబై చెబుతూ.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. మంగళవారం అర్ధరాత్రి యువకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడవాడలా డీజే సౌండ్లు పెట్టుకుని నృత్యాలు చేస్తూ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జులాయిల ఆగడాలు కట్టించేందుకు ప్రతి కూడలిలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పారిశ్రామిక ప్రాంతం పోలీస్ వలయంగా మారింది. దీంతో జులాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసినట్లయ్యింది. మంగళవారం రాత్రి 10గంటల నుంచే రామగుండం సీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. బుధవారం గోదావరిఖని చౌరస్తాలోని వైట్ హౌస్‌లో కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజు, వివిధ రాజకీయ పక్షాల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, ముస్తాఫా, నాయకులు చుక్కల శ్రీనివాస్, గట్ల రమేష్, సన్ని, హమీద్, సిరాజ్, బీజేపీ నాయకులు మామిడి రాజేష్, మహవాది రామన్న, సీపీఐ నాయకులు కే స్వామి పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మహిళలు ఇంటిముందు రంగు రంగుల ముగ్గులు వేశారు.

● ముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి కొత్త సంవత్సరం వేడుకలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాల వద్ద యూత్ సభ్యులు కేక్ కట్ చేసి పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వగతం పలికారు. బుధవారం ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు 11గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరంలో ప్రజలు, రైతులు, సబ్బండ వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. ఆలయాలు ప్రజలతో కిక్కిరిసిపోయాయి.

● మంథని (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో నూతన ఆలోచనలుచేస్తూ నూతన ఉజ్జీవంతో ముందుకు సాగాలని రెవరెండ్ వల్లూరి ప్రభాకర్ అన్నారు. స్థానిక సీయోను ప్రార్థన మందిరంలో నూతన సంవత్సర ప్రత్యేక ఆరాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేక్ కట్ చేసి సహపంక్తి భోజనాలు చేశారు. శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో సీయోను ప్రార్థన మందిరంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మహేష్, మార్క్, దయ రాజ్, స మూయేలు, రాజేష్, సంఘ పెద్దలు అంకరి కుమార్, జోసఫ్, ప్రసాద్, రమేష్, ప్రేమ్‌కుమార్, సదానందం, కుమార్ పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను సుల్తానాబాద్‌లో వ్యవసాయ కూలీలు ఘనంగా జరుపుకున్నారు. పొలంలో నాట్లు వేసుకోవడానికి వచ్చిన వారు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రజలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్చకులు సౌమిత్రి శ్రావణ్ కుమార్ మాట్లాడారు. వేడుకల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సుల్తానాబాద్ పోలీసులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గురువారం ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో పూజలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో గ్రామాల అభివృద్ధి చెందాలని మల్లికార్జున స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కందుల సదాశివ్, జంగం కొమురయ్య, నేదురి మల్లేష్, నుంచు సంపత్, గుర్రం సదానందం, కందుల అభిలాష్, కందుల రిషిద్ కుమార్, మొగిలి సాయికుమార్, లక్ష్మణ్, మొగిలి అనిల్, తోట్ల సిద్దు, సూత్రాల సదానందం, చెరుకు సదయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఖనిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మంథనిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



సుల్తానాబాద్‌లో మహిళా కూలీల సంబరాలు



ఓదెలలో స్వీట్లు పంపిణీ చేస్తున్న ఉద్యమకారులు

ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

- మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో మంథని నియోజకవర్గ, పెద్దపల్లి జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం వీడియోసందేశాన్ని విడుదలచేశారు. నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సరంలో వారు అనుకున్న పనులను దిగ్విజయంగా జరగాలని దేవుడిని కోరుకున్నారు. రైతులకు పాడి పంటలు మంచిగా అభివృద్ధి కావాలన్నారు.

పారిశుధ్య విభాగం ప్రక్షాళనకు చర్యలు

- రామగుండంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

కోల్‌సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు, ఆ విభాగాన్ని ప్రక్షాళన చేసేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పారిశుధ్య నిర్వహణలో అవుట్ సోర్సింగ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కలిగించారు. 12మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్ల జోన్లు, వార్డులను మార్పులు చేశారు. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకుని ఈ చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. మంగళవారం శానిటరీ విభాగం సిబ్బందిని కలెక్టరేట్‌కు పిలిచి సమీక్ష జరిపిన కలెక్టర్ శ్రీహర్ష శానిటేషన్ నిర్వహణలో లోపాలపై కూడా చర్చించారు. పారిశుధ్యం నిర్వహణ, సింగరేణి, మున్సిపల్ మధ్య సమన్వయ లోపాలపై ఆరాతీశారు. నాయకులు, ప్రజాప్రతినిధుల ఇళ్లలోకి కార్మికులను పంపవద్దని, కార్మికులను పూర్తిస్థాయిలో పారిశుధ్య చర్యలకే వినియోగించాలని సూచించారు. సూపర్‌వైజర్లకు సంబంధించి జోన్లను మారుస్తున్నామని, ఎవరైనా రాజకీయ ఒత్తిళ్లు తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సిబ్బంది జోన్లు, డివిజన్లను మార్పులు చేస్తూ కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఉత్తర్వులు జారీచేశారు.

జాబితా మార్పు..

అదనపు కలెక్టర్, కమిషనర్ అరుణశ్రీ మొదట ఒక జాబితాను విడుదల చేశారు. మళ్లీ అరగంటలోనే ఆ జాబితాను మార్చి మరో జాబితాను విడుదల చేశారు. గతంలో శ్రీకాంత్ కమిషనర్‌గా ఉన్న సమయంలో రోజుకో జాబితా చొప్పున విడుదల చేయడం గందరగోళానికి తావిచ్చినట్లయ్యింది. అదనపు కలెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో కూడా రెండు జాబితాలు రూపొందిం చడం కార్పొరేషన్ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది. మొత్తంగా పారిశుధ్య విభాగం ప్రక్షాళనపై కలెక్టర్ దృష్టి పెట్టడం ఇప్పుడు కార్పొరేషన్‌లో అలర్ట్ అయ్యారు. మరో 20 రోజుల్లో పాలకవర్గ స్థానంలో ప్రత్యేక అధికారి పాలన రానున్నది. ఈ నేపథ్యంలో రామగుండంలో పనిచేస్తున్న వారిని గోదావరిఖనిలో, గోదావరిఖనిలో పనిచేస్తున్న వారికి రామగుండం, ఎన్‌టీపీసీ, యైటింక్లయిన్‌కాలనీల్లో జోన్లు కేటాయించారు.

జోన్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	డివిజన్లు
1	ఏ సోమేష్	1, 20, 21, 22(రామగుండం)
2	బీ రాజబాబు	2, 3, 4, 23, 24(ఎన్‌టీపీసీ)
3	జీ ఉమా మహేష్	5, 7, 9, 25
4	బండారి రవి	6, 8, 28, 29
5	ఎండీ యూసుఫ్	10, 30, 32, 41
6	వీ అశోక్	27, 40, 49, 50
7	ఎన్ దయానంద్	31, 42, 43, 48
8.	వీ సంపత్	26, 38, 39, 47
9	ఎం తిరుపతి	37, 44, 45, 46
10	సీహెచ్ సుగుణాకర్‌రెడ్డి	33, 34, 35, 36
11	ఏ శ్రీనివాస్	11, 12, 13, 14
12.	ఆర్ సారయ్య	15,16,17,18, 19(యైటింక్లయిన్‌కాలనీ)

వచ్చేనెల 7న మహా కళా ప్రదర్శన..

- ఎమ్మార్పీఎస్ కళాకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భరత్

కాల్వశ్రీరాంపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు వెయ్యి గొంతులు, లక్ష డప్పులతో హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే మహాకళా ప్రదర్శనకు కళాకారులు కదిలిరావాలని ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ కళాకారుల సంఘం అధ్యక్షుడు రామంచ భరత్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కళాకారుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామంచ భరత్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ జెండా పట్టుకొని మందకృష్ణ మాదిగ పోరాడుతున్నారని, ఆయన చేపట్టిన కవాతుకు మద్దతుగా మాదిగ కళాకారులు, కవులు, సహకరించాలన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలు వర్గీకరణకు మద్దతు తెలియజేయాలని, వర్గీకరణకు ఎస్సీల్లో ఉన్న 59కులాల్లో ఒక కులం మాత్రమే వ్యతిరేకంగా ఉందన్నారు. అన్ని ఉద్యమాల్లో, రాజకీయ పార్టీల గెలుపోటముల్లో మాదిగ కళాకారుల పాత్ర ఉందన్నారు. మొట్టమొదటిసారిగా హక్కుల సాధ నకోసం డప్పులు కొట్టబోతున్నామన్నారు. జనవరి 7నుంచి ఫిబ్రవరి 7వరకు అన్ని జిల్లాల్లో రథయాత్ర నిర్వహించి, అదేరోజు హైదరాబాద్‌లో లక్షడప్పులు, వెయ్యి గొంతుల కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, ఎమ్మెస్పీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజమ్ వెంకటస్వామి, కళాకారులు తూండ్ల రాజయ్య, బర్ల తిరుపతి, పాల రాజేశం, పాల శంకర్, దంతనపల్లి ధర్మయ్య, అంబాల సతీష్, పుల్లూరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మికి ఇబ్బందులు తొలగేదెన్నడో?

- ఏడాది దాటినా పెరగని బస్సులు
- రాయపట్నం రూట్‌లో రద్దీ
- పుణ్యక్షేత్రాలకు, గోదావరి స్నానానికి పెరిగిన భక్తులు



చొప్పదండి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాయపట్నం రూట్‌లో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. ఆర్టీసీలో మహాలక్ష్మి స్కీమ్ ప్రవేశపెట్టడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఇందుకు అనుగుణంగా కొత్త బస్సులను ప్రవేశపెడతామని చెప్పిన ప్రభుత్వం ఏడాది దాటినా హామీ అమలుకు నోచుకోలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అతిపెద్ద ఆర్డినరీ రూట్‌గా ఉన్న రాయపట్నం రూట్ పలు జిల్లాలకు వారధిగా నిలు స్తుంది. పలు మండలాలకు తోడుగా వందకు పైగా గ్రామాల ప్రజలు ఈ రూట్‌లో ప్రతినిత్యం ఆర్టీసీ బస్సుల ద్వారా రాక పోకలు కొనసాగిస్తుంటారు.

● ఒకేసారి ఐదు బస్సులు

కరీంనగర్, మంచిర్యాల మధ్య ప్రతి 15 నిమిషాలకు ఒకసారి నడవాల్సిన పల్లెవెలుగు బస్సులు ఒకేసారి వరుసగా ఐదు బస్సులు కలిసి వస్తున్నాయి. 11 గంటల నుంచి 11:30 గంటల వరకు కరీంనగర్ నుంచి ఐదు బస్సులు మంచిర్యాల వైపు వెళ్లి, తిరిగి సాయంత్రం 5 నుంచి 5:30 గంటల మధ్యలో కరీంనగర్‌కు ఈ బస్సులు వరుసగా వస్తున్నాయి.

● ఏడాది దాటినా పెరగని బస్సులు

2023 డిసెంబర్ 7న రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథ కాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణాన్ని కల్పించింది. పథకానికి ముందే ఈ రూట్‌లో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక ఇబ్బం దులు పడ్డారు. కరీంనగర్-1, 2 డిపో, మంచి ర్యాల డిపో ద్వారా కరీంనగర్-మంచిర్యాల మధ్యలో పల్లెవెలుగు బస్సులు నడుస్తుంటాయి. కరీంనగర్ నుంచి మంచిర్యా లకు సాయంత్రం 5 గంటల వరకు ప్రతి 15 నిమిషా లకు ఒక బస్సు ఉండగా, సాయంత్రం 5 గంటల తర్వా త రాత్రి 9:30 గంటల వరకు 30 నిమిషాలకు ఒక బస్సును నడిపిస్తున్నారు. వివిధ పనులు, ఉద్యోగ, వ్యాపారరీత్యా ప్రతి రోజు ఉదయం కరీంనగర్‌కు వచ్చిపో తుంటారు. తిరుగు ప్రయాణంలో చొప్పదండి, ధర్మారం, లక్షెట్టిపేట, మంచిర్యాల, జన్నారం వెళ్లే ప్రయాణికులకు సాయంత్రం 5 గంటల తర్వాత బస్సు దొరకడం గగన మైపోతుంది. ఏడాదిలో ఒక్క కొత్త బస్సును కూడా రూట్‌లో పెంచకపోగా ప్రయాణికుల సంఖ్య పెరిగింది.

● పుణ్యక్షేత్రాలకు పెరిగిన ప్రయాణికులు

రాయపట్నం రూట్‌లో ప్రజలు పలు పుణ్యక్షేత్రాల సందర్శనకు నిత్యం వందలాది మంది వెళ్తుంటారు. ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి, గూడెం సత్యనారా యణ స్వామి, కోటిలింగాలలో శివపార్వతుల దర్శనానికి భక్తుల తాకిడి బాగా పెరిగింది. వీటికి తోడు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు గోదావరి నది స్నా నానికి వచ్చిపోతుంటారు. రాపయట్నం నుంచి కరీంన గర్ వరకు బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు.

● బస్సుల సంఖ్య పెంచాలి

కరీంనగర్, లక్షెట్టిపేట, మంచిర్యాల మధ్య మరికొన్ని బస్సులను పెంచాల్సిన అవసరం ఉంది. దాదాపు ప్రతి బస్సులో ప్రతిరోజు 80 నుంచి 100 మంది ప్రయాణిస్తున్నారు. కరీంనగర్‌లో సాయంత్రం 5 నుంచి 7 గంట ల వరకు రద్దీ తీవ్రంగా ఉండగా, ప్రైవేట్ వాహనాల కోసం కూడా వేచి చూసే పరిస్థితి ఎదురవుతోంది.



చొప్పదండి బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు

ప్రమాదవశాత్తు బావిలో పడి కార్మికుడి మృతి

గంగాధర, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గట్టుబూత్కుర్‌లో ప్రమాద వశాత్తు బావిలో పడి కార్మికుడు మృతి చెందినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర చంద్రాపూర్‌కు చెందిన భార్యాభర్తలు గోవిందరావు(54), చంద్రకళబాయి గట్టుబూత్కుర్ ఫౌల్ట్రీలో కార్మికులుగా పనిచేస్తూ మేకలను పెంచుకుంటున్నారు. గోవిందరావు బుధవారం మేకల మేత కోసం సమీపంలోని బావి పక్కన చెట్టు కొమ్మలు విరిచేందుకు వెళ్లాడు.

కత్తితో చెట్టు కొమ్మలను కోస్తుండగా కాలు జారి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు : తప్పిన ప్రమాదం

వేములవాడ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు కారును ఢీకొన్న ఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ పట్టణానికి చెందిన సాంబయ్య అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న దర్శనానికి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కారు పక్కనే వున్న డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. దీంతో ప్రమాదం తప్పింది. డివైడర్ అడ్డుగా లేకపోతే కారు కల్వర్టులో పడిపోయి ప్రమాదం వుండేది. కారులో వున్నవారు స్వల్పగాయాలతో బయట పడ్డారు. ఘటనలో కారు ధ్వంసమైంది.



మోడులా మారిన తాటి వనం

తాటిచెట్లకు తెగులు

- ఎండిపోతున్న వనాలు
- ఉపాధి కోల్పోతున్న గీత కార్మికులు



ఎండిపోయిన తాటి చెట్టు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెగులు బారిన పడి తాటి చెట్లు ఎండిపోతున్నాయి. దీంతో ఉపాధి కోల్పోతున్నామని గీత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు దుమాల, రాజన్నపేట, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల శివారుల్లో తాటి చెట్లు తెగులు సోకి కళ్ల ముందే ఎండిపోతున్నాయి. నివారణ చర్యలు చేపట్టే మార్గం కానరాక గీత కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. చేసేదేమీ లేక చెట్లను వదిలేస్తు న్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే సుమారు 2 వేల తాటి చెట్లకు తెగులు సోకి ఎండిపోయాయి. మండలంలో సుమారు 10 వేల మంది తాటి చెట్ల ద్వారా వచ్చే నీరా, కల్లు సేకరించి ఉపాధి పొందుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తాటి వనాలు ఎండిపోవడంతో గీత కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తాటి చెట్లకు సోకిన తెగులును అరికట్టేందుకు అవగాహన కల్పించాలని, తాటి చెట్లకు బతికించాలని గీతకార్మికులు కోరుతున్నారు.

రోజుకు రూ.300కూడా రావడం లేదు



- కదిరె నాంపల్లి, గీత కార్మికుడు దుమాల, ఎల్లారెడ్డిపేట

దుమాల శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న తాటి వనంలో చెట్లు గీస్తూ కుటుంబాన్ని పోషించేవాడిని. నిత్యం కల్లు అమ్మడం ద్వారా రూ.600 వరకు డబ్బులు వచ్చేవి. ప్రస్తుతం తాటి చెట్లకు తెగులు సోకి ఎండిపోవడంతో కల్లు తగ్గిపోయింది. రోజుకు రూ.300 కూడా రావడం లేదు. అధికారులు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



రవికిరణ్ (ఫైల్)

ఓదెల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు పద్మశాలి సంఘం గోదాం సమీపంలో మంగళవారం రాత్రి బైక్ అదుపు తప్పి కొలనూర్ గ్రామీణ బ్యాంకు ఉద్యోగి తీగల రవికిరణ్ (30) అక్కడికక్కడే మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొలనూర్ గ్రామీణ బ్యాంకులో క్లర్కుగా విధులు నిర్వహిస్తున్న రవికిరణ్ ప్రతిరోజు మాదిరిగానే తన స్వగ్రామం జమ్మికుంట మండలం కోరపల్లి నుంచి వచ్చి కొలనూర్‌లోని బ్యాంకులో విధులు నిర్వహించి వెళుతున్నాడు. బ్యాంక్‌లో విధులు నిర్వహించి రాత్రి తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో బలమైన గాయాలై స్పృహ తప్పాడు. ఇది గమనించిన తన బంధువు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే రవికిరణ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్గల్ గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని సూరుపాక రమణ కుమార్ (30) అనే యువకుడు మంగళవారం రాత్రి మృతి చెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రమణకుమార్ తన ప్యాసింజర్ ఆటో నడుపుకుంటూ కోరుట్ల నుంచి జగిత్యాలకు వస్తుండగా చల్గల్‌లోని ఎల్లమ్మ గుడిప్రాంతంలో రాత్రి 10 గంటల సమయంలో గుర్తుతెలియని వాహ నం ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటో నుజ్జునుజ్జయింది. రమణకుమార్‌కు తీవ్రగాయాలై తీవ్రరక్తస్రావం కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు రమణ కుమార్ తల్లి ఇంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లి చెరువు తండాకు చెందిన మేకల కాపరి భూక్య నరేష్ బుధవారం తీవ్ర గాయాల పాలయ్యాడు. తండాకు చెందిన నరేష్ తన గొర్రెలు, మేకలను తీసుకుని మేత కోసం శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు.. తిరిగి వస్తున్న క్రమంలో చెట్ల పొదల్లో నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి దాడికి దిగింది. అప్రమత్తమైన నరేష్ చేతిని అడ్డుపెట్టి మరో చేతిలో ఉన్న గొడ్డలితో ఎలుగుబంటిపై ఎదురు తిరిగాడు. దీంతో ఎలుగుబంటి పారిపోయింది. వెంటనే చుట్టుపక్కల వారు మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

మంథని, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిసోమ న్‌పల్లిలో కడారి లక్ష్మి (51)అనే వృద్ధురాలు బుధవారం వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. గడ్డి కోస్తున్న సమయంలో ఒడ్డుపై ఉన్న బోరు వైరు చూసుకోకుండా కోయడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కూతురు సడిరం రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంచలోహ విగ్రహం చోరీ

కరీంనగర్ క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల కేంద్రంలోని శివభక్త ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దుండగులు పంచలోహ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. దుండగులు ఆలయంలోని పంచలోహ విగ్రహంతో పాటు తాంబాలం, పూజా సామగ్రి, హుండీ పగలగొట్టి డబ్బులు ఎత్తుకుపోయినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి భజనల అనంతరం తాళం వేసి ఇళ్లకు వెళ్లిపోయిన పూజారి బుధవారం ఉదయం ఆలయానికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉందన్నారు. ఆలయంలోని పంచలోహ విగ్రహం, ఇతర వస్తువుల విలువ 40 వేల రూపాయలు ఉంటుందన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

● దాచారం యువకుడి మృతి

ఇల్లంతకుంట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామానికి చెందిన ఈదులకంటి రిషిత్‌కుమార్‌రెడ్డి (20) అనే బీటెక్ విద్యార్థి హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. దాచారం గ్రామానికి చెందిన ఈదులకంటి రిషిత్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి రామోజీఫిల్మ్‌సిటీ సమీపంలో ఫుట్‌పాత్‌పై ఉండి స్నేహితుల కోసం ఎదురుచూస్తున్నాడు. గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

కొత్త సంవత్సర వేడుకల్లో విషాదం

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి ● చర్చిలో ప్రార్థనలు చేసి వెళ్తుండగా భార్యాభర్తల దుర్మరణం

ధర్మపురి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాలో బుధ వారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా చర్చిలో ప్రార్థనలు చేసి ఇంటికి వెళుతుండగా జగి త్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో బుధవా రం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందా రు. ధర్మపురి మండలంలోని రామయ్యపల్లె గ్రామానికి చెందిన కూస చంద్రయ్య (60), కూస భాగ్యమ్మ (55) అనే భార్యాభర్తలు ధర్మపురిలోని మన్నా పెంతకోస్తు చర్చిలో ప్రార్థనలు చేసేందుకు వచ్చారు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటల వరకు చర్చిలో ప్రార్థనలు చేసి స్వగ్రామానికి ద్విచక్రవాహ నంపై బయలుదేరారు. ధర్మపురి లక్ష్మీనరసింహకాలనీ సమీపంలో రాయపట్నం వైపు నుంచి వచ్చిన కారు అతివేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కూస చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కూస భాగ్యమ్మను 108 వాహనంలో చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బుధవారం ఉదయం ఆరు గంటలకు మృతి చెందింది. ప్రార్థనలు ముగించుకుని మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరే లోపు ప్రమాదం జరిగి భార్యాభర్తలు మృతి చెందడంపై కుటుంబంలో తీవ్రవిషాదం నెలకొంది. సంఘటనా స్థలాన్ని ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ చేరుకుని వివరాలు సేకరించారు. కారు డ్రైవర్ మంచిర్యాలకు చెందిన అన్నమన్‌గా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన చంద్రయ్య, భాగ్యమ్మ (ఫైల్)



లింగంపల్లి అక్షయ్(ఫైల్)

● రాజన్న సిరిసిల్ల జిల్లాలో యువకుడు

సిరిసిల్ల క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దాపూర్ గ్రామానికి చెంది న లింగంపల్లి అక్షయ్ (21) అనే యువ కుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందా డు. జిల్లాలోని సర్దాపూర్‌కు చెందిన అక్షయ్ గ్రామంలో స్నేహితులతో న్యూ ఇయర్ వేడు కలు జరుపుకున్నాడు. అందరూ కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులోనే బుధవారం తెల్లవారుజామున 2.30 గంటలకు మహేశ్ అనే స్నేహితుడిని వెంకటాపూర్‌లో దించేందుకు అక్షయ్, మరో స్నేహితుడు రవి ద్విచక్ర వాహనంపై కలిసి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా సర్దాపూర్ వద్ద బైక్ అదుపు తప్పి పక్కన డివైడర్‌కు ఢీకొని కిందపడ్డారు. అక్షయ్‌కి తీవ్రగాయాలవగా రవికి స్వల్ప గాయాల య్యాయి. స్వల్ప గాయాలతో ఉన్న రవి వెం టనే 108వాహనానికి సమాచారం అందించాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా అక్షయ్ మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మరొకరి మృతి

● భార్య మృతిచెందిన ఆరు రోజులకు భర్త మృతి

తిమ్మాపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఓ శుభకార్యానికి వేములవాడకు వెళ్లి కారులో తిరిగి కరీంనగర్‌కు వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తిమ్మాపూర్ మండలం మహత్మానగర్ గ్రామానికి చెందిన పోలవేణి గట్టుబాబు(63), తన భార్య మంగ(50), సోదరి మాశెట్టి అహల్య, బావ అశోక్ గత నెల 26న ఓ శుభకార్యానికి కారులో వేములవాడకు వెళ్లి తిరిగి కరీంనగర్‌కు వస్తున్నారు. బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. సంఘటన స్థలంలోనే మంగ మృతి చెందగా, గట్టుబాబు, మాశెట్టి అహల్య, మాశెట్టి అశోక్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరారు. గట్టుబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదారాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గట్టుబాబు బుధవారం ఉదయం మృతి చెందాడు. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలోనే మాశెట్టి అశోక్, అహల్య చికిత్స పొందుతున్నారు. వారు ప్రస్తుతం కోలుకుంటున్నట్లు బంధువులు తెలిపారు.



గట్టుబాబు (ఫైల్)

ఆయన కార్టూన్లు.. యువతకు స్ఫూర్తి





- కార్టూనిస్టుగా రాణిస్తున్న విజయ్‌కుమార్
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- అవినీతి, అశ్లీలత, నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి

సుల్తానాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్‌కు చెందిన పురం విజయ్‌కుమార్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కార్టూనిస్టుగా అనేక బహుమతులు, అవార్డులు అందుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాలకు మద్దతుగా ఆయన కార్టున్లు గీస్తూ ప్రజా చైతన్య కార్యక్రమాలకు ఊతమిచ్చారు. చెడు అలవాట్ల వల్ల కలిగే పరిణామాలను కార్టూన్ల ద్వారా తెలియజేస్తూ యువత సన్మార్గంలో నడిచేలా సందేశాన్ని ఇస్తున్నారు. చిన్నతనం నుంచే చిత్రాలు గీయటంపై మక్కువ పెంచుకున్న బీయస్సీ డిగ్రీతోపాటు డ్రాయింగ్‌లో హయ్యర్ గ్రేడ్ పూర్తిచేశారు. ఆర్ఎంపీ అయిన తండ్రి కూడా చిత్రాకారుడు కావడంతో విజయ్‌కుమార్‌కూ ఆసక్తి కలిగింది. చందమామ పిల్లల మాస పత్రికలో వచ్చే శంకర్, చిత్రల బొమ్మలు చూసి స్ఫూర్తి పొంది, 1982 నుంచి పలు పత్రికలకు కార్టూన్లను గీయడం ప్రారంభించారు. తన తండ్రిలాగే తాను కూడా ఆర్ఎంపీగా కొనసాగుతూ.. మరోవైపు సామాజిక రుగ్మతలను వివరించే కార్టూన్లు వేస్తూ ప్రజలను ఆలోచింపజేస్తున్నారు. సమాజంలోని అవినీతి, అశ్లీలత, నిరక్షరాస్యతతను నిర్మూలించడం ధ్యేయమని విజయ్‌కుమార్ తెలిపారు. ప్రముఖ కార్టూనిస్టులు జయదేవ్, సుభాని, సరసి, మోహన్ తదితరులు విజయ్ కుమార్ కార్టూన్లను చూసి అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకు దాదాపు ఐదు వేలకు పైగా విజయ్ గీసిన కార్టూన్లు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. వివిధ సందర్భాల్లో అవార్డులు, జాతీయ, అంతర్జా తీయ స్థాయిలో నిర్వహించిన కార్టూన్ల పోటీల్లో పురం విజయ్‌కుమార్ అనేక అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు.



ప్రభుత్వ సలహాదారు రమణాచారి నుంచి అవార్డు అందుకుంటున్న విజయ్(ఫైల్)

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన మొగిలిపాక తిరుపతిగౌడ్ (53) అనే గీత కార్మికుడు బుధవారం ఈతచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలయ్యాయి. తిరుపతిగౌడ్ ఎప్పటిలాగే కల్లు గీయడానికి సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. ఈతచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో తిరుపతిగౌడ్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

రైతు ఆకస్మిక మృతి

శంకరపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేటలో పొలం వద్ద ఓ రైతు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట గ్రామానికి చెందిన చింతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (54) అనే రైతు బుధవారం వ్యవసాయ పొలం వద్ద ఉన్న పాడి గేదెలకు గడ్డి వేస్తుండగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. అక్కడే ఉన్న అతని కొడుకు కృష్ణసాయిరెడ్డితో పాటు సమీపంలోని రైతులు వచ్చి సీపీఆర్ చేసినా ఫలితం లేదు. మృతుడికి భార్య స్వర్ణలతతో పాటు ఇద్దరు కుమారులున్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లికి చెందిన నర్ర శంకరయ్య (55) అనే వ్యక్తి బ్లేడ్‌తో గొంతుకోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం తన ఇంట్లో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావమై మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

మల్లాపూర్, జనవరి, 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన తోకల తాతయ్య(50)అనే మత్స్యకారుడు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజుకుమార్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తోకల తాతయ్య అనే మత్స్యకారుడు కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఉన్న తాతయ్య బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడు..


జగిత్యాలరూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన తెనుగు పవన్(26) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పవన్ కోరుట్లలోని ఓ బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా మనస్తాపంతో ఉంటున్నాడు. జీవితంపై విరక్తిచెంది బుధవారం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పవన్ సోదరుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన సంవత్సర వేడుకల్లో ఘర్షణ

ఎల్లారెడ్డిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకల్లో ఇద్దరి మధ్య మంగళవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని యువకుడు పర్శరాములుతో పాటు పలువురు కలిసి విందు ఏర్పాటు చేసుకున్నారు.

మద్యం తాగి డీజే సౌండ్ వద్ద నృత్యాలు చేస్తున్న క్రమంలో పర్శరాములు, నరేశ్ మధ్య మాగిమాట పెరిగి దాడులకు దిగారు. దీంతో పర్శరాములు తీవ్ర గాయాలపాలయ్యాడు. అక్కడనున్న వారు 100 సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న నీటి విడుదల



కాకతీయ కాలువ ద్వారా విడుదలవుతున్న నీరు

తిమ్మాపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని లోయర్ మానేరు రిజర్వాయర్ నుంచి కాకతీయ కాలువ ద్వారా బుధవారం 31న పంటలకు నీటిని విడుదల చేశారు. మంగళవారం 500 క్యూసెక్కుల నుంచి 4వేల క్యూసెక్కుల వరకు క్రమంగా పెంచుతూ ప్రస్తుతం నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం ఎల్ఎండీలో 22.413 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 4వేల క్యూసెక్కుల నీరు వెళ్తుండగా ఎంఎంఆర్ నుంచి 160 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

హమాలీ కార్మికుల సమ్మె



సుల్తానాబాద్‌లో సమ్మె చేస్తున్న హమాలీలు

సుల్తానాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ పౌర సరఫరాల సంస్థ గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులు ఆందోళనకు దిగారు. సుల్తానాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులోగల గోదాము వద్ద హమాలీలు బుధవారం సమ్మె చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ హమాలీ సంఘం నాయకుడు మైలారం తిరుపతి మాట్లాడుతూ హమాలీలకు సంబంధించి కూలీ రేట్లను ప్రభుత్వం పెంచిన ఉత్తర్వులు విడుదల చేయలేదన్నారు. జీవో విడుదల చేసే వరకు తాము నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు.

శాతవాహనలో కొత్త కోర్సులేవి?



తరం మారుతోంది.. విద్యా వ్యవస్థలోనూ అనేక మార్పులు వస్తున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. శాతవాహన యూనివర్సిటీలో మాత్రం ఎటువంటి మార్పులు కనిపించడం లేదు.. తరాలుగా ఉన్న పాత కోర్సులే తప్ప కొత్తవి ప్రారంభం కావడం లేదు.. యూనివర్సిటీ అభివృద్ధి మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనకకు అన్న చందంగా ఉంది. యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ వచ్చినందున ఆయన కొత్త కోర్సులపై, సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

- పాత కోర్సులతోనే నెట్టుకొస్తున్న వైనం
- ఏడాదిన్నరగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ లేక ఇబ్బందులు
- నూతన సంవత్సరంలోనైనా యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల డిమాండ్

గణేశ్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలన్ని కొత్త కోర్సులతో ముందుకెళ్తుంటే శాతవాహన విశ్వవిద్యాలయం మాత్రం పాత కోర్సులతోనే నెట్టుకొస్తోంది. 2008లో శాతవాహన విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. యూనివర్సిటీలో ఇప్పటికీ అప్పుడు ప్రవేశపెట్టిన కోర్సులు మా త్రమే ఉన్నాయి. కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో యూనివర్సిటీ అభివృ ద్ధికి నోచుకోలేదు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని యూని వర్సిటీల ఉప కులపతులతో సమావేశం నిర్వహించారు. విశ్వవిద్యాల యాల ప్రగతికి దిశానిర్దేశం చేశారు. యువత, విద్యార్థులకు ఉపాధినిచ్చే, సాంకేతిక, ఇతరత్రా కోర్సుల ప్రవేశాెట్టేందుకు కార్యాచరణ రూపొందిం చాలని సూచించారు. ప్రాంగణంలో ఉన్న వనరులు, ఏయే కోర్సులను ప్రవేశ పెడితే ప్రయోజనకరంగా ఉంటుంది, స్వయం ఉపాధి కల్పించేవి ప్రవేశపెడితే విద్యార్థులకు మేలు జరుగుతుందనే విషయాలపై సమీక్ష నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

● సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులతో ఇబ్బందులు

శాతవాహన విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ప్రవేశపెడితే విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లకుండా ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉన్న శాతవాహన యూనివర్సిటీలో చదువుకోవచ్చు. కొత్త కోర్సులతోపాటు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు లను రెగ్యులర్ కోర్సులు గా మార్చాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. రెగ్యులర్ కోర్సులుగా నడుస్తున్న తెలుగు, ఇంగ్లీష్, బోటనీ, మ్యాథమెటిక్స్ విభాగాలను యూజీసీ 12బీ గుర్తింపు వచ్చిన తర్వాత ఈ విద్యా సంవత్సరం నుంచి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విభాగాల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయకపోవడం వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

● నిధులు లేక ఇబ్బందులు

రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర, జాతీయ సంస్థల ద్వారా వచ్చే బడ్జెట్ సరిగా విడుదల కావడంలేదు. దీనివల్ల విద్యార్థులకు పరిశోధన ఫెలోషిప్స్ ప్రాజెక్టులు రావడం లేదు. విశ్వవిద్యా లయం ప్రాంగణంలో వివిధ కళాశాలలో 12 డిపార్ట్మెంట్లు ఉన్నాయి. 900 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం 2025 లోనైనా యూనివర్సిటీ కొత్త కోర్సులు మాం జురు చేస్తుందని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. శాత వాహన యూని వర్సిటీలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ గడువు ముగిసి ఏడాదిన్నర గడిచింది. కౌన్సిల్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. కొత్త ఏడాదిలోనైనా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ను ఏర్పాటు చే యాలని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలి..

- చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘ నాయకుడు



శాతవాహన విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. యూనివర్సిటీలో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ సంవత్సర అయినా ప్రభుత్వం శాతవాహన యూనివర్సిటీ కొత్తకోర్సులు తీసుకొచ్చినట్లైతే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ని ఏర్పాటు చేయాలి

-కాంపెల్లి అరవింద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు



శాతవాహన విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ని ఏర్పాటు చేయాలి. ఏడాదిన్నరగా కౌన్సిల్ లేకపోవడంతో నిర్ణయాలన్నీ ఏకపక్షంగా జరుగుతున్నాయి. యూనివర్సిటీ అభివృద్ధి జరగడం లేదు. పూర్తిస్థాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ని ఏర్పాటు చేసి నూతన కోర్సులను ప్రవేశ పెట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

నూతన సంవత్సర వేళ ఆలయాల్లో భక్తుల రద్దీ

● వేములవాడ, కొండగట్టు, ధర్మపురిలో పూజలు





కొండగట్టులో..

వేములవాడలో..



ధర్మపురిలో..

వేములవాడ కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. అనంతరం పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా 40 వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా వేములవాడలోని బద్దిపోచమ్మ అమ్మ వారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది.

రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు.

వేములవాడ శీరాజరాజేశ్వర స్వామి వారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రాజన్నను దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. రాజన్న దర్శనం అనంతరం అర్చకులు నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఇదీలా ఉండగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రాజన్నను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజ అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

కొండగట్టులో...

మల్యాల: నూతన సంవత్సరం పురస్కరించుకొని కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం బుధవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి అంజన్నను దర్శించుకున్నారు. భక్తుల రద్దీరోజంతా కొనగసాగగా ప్రజా ప్రతినిధుల దర్శనాల కోసం సర్వదర్శనాలు పలుమార్లు నిలిపివేయడంతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. అలాగే సిఫారసులతో అనేక మంది భక్తులు ప్రత్యేక దర్శనాల కోసం బారులు తీరారు. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మన్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అంజన్నను దర్శించుకున్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి: లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు బుధవారం కిక్కిరిసాయి. ముందుగా భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయం, రావి చెట్టు ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టు భక్తులు, విద్యార్థులు ప్రదక్షిణలు చేసి దర్శనం చేసుకున్నారు. అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు.

వేములవాడలో ఎస్పీ అఖిల్‌మహాజన్





కొండగట్టులో విప్ ఆదిశ్రీనివాస్ పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

అయ్యప్ప భక్తుల శోభాయాత్ర



మానకొండూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు.

మానకొండూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో బుధవారం అయ్యప్ప భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. చెరువుకట్ట వద్ద వెంకటేశ్వర ఆలయం నుంచి మార్కెట్‌రోడ్డు, తూర్పు దర్వాజ బస్టాండ్ మీదుగా పల్లెమీద బస్టాండ్ వరకు శోభాయాత్రను నిర్వహించారు. ఈ యత్రలో అయ్యప్ప భక్తులు అయ్యప్ప పాటలను పాడుతూ భజనలు చేస్తు ఊరేగింపుగా వెళ్లారు. ఈ శోభాయాత్రలో 30 మందికి పైగా అయ్యప్ప భక్తులు ఉన్నారు.

బాల సాహితీవేత్త డాక్టర్ కందేపికి బ్రిటీష్ వరల్డ్ పురస్కారం



బ్రిటీష్ వరల్డ్ రికార్డుతో రాణీప్రసాద్

సిరిసిల్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన ప్రముఖబాల సాహితీవేత్త డాక్టర్ కందేపీ రాణీప్రసాద్‌కు బ్రిటీష్ వరల్డ్ రికార్డు లభించింది. బుధవారం ఆ సంస్థ ది బ్రిటీష్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, అవార్డు, మెడల్‌ను పంపించింది. రాణీప్రసాద్ బాల సాహిత్యంలో సృజనాత్మకమైన రచనలు చేయడంతోపాటు సృజన్ చిల్డ్రన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంటున్నారు. మానవ దేహంలోని అవయవాలు, ఆసుపత్రి, యంత్ర పరికరాలకు పొడుపు కథలు రాసి ఆసుపత్రుల్లో ప్రదర్శిస్తూ ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తున్నారు. వేస్టేజీలతో పలు కళాకృతులను తయారు చేసి ప్రదర్శనను అందిస్తున్నందుకు బ్రిటీష్ వరల్డ్ రికార్డులో నమోదయ్యారు.

పొగమంచు కాదు.. దుమ్ము

● రోడ్డు పనులు పూర్తికాక ప్రయాణికుల ఇబ్బందులు



మర్రిపల్లి హైలెవల్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై దుమ్ము

వేములవాడ రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): చలికాలం కదా పైన ఫొటోలో కనిపించేంది పొగమంచు అనుకునేరు. వాహనాల రాక పోకలతో రోడ్డుపై లేస్తున్న దుమ్ము. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి శివారులోని కల్వర్టు వద్ద ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మించింది. ప్రధాన రహదారిని కలిపే లింకురోడ్డు పూర్తికాకపోవడంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో దుమ్ములేస్తోంది. దీంతో ద్విచక్రవాహనదారులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. వేములవాడ దేవస్థానానికి చేరుకునే వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి లింకురోడ్డు పనులు వేగవంతం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట మల్లికార్జునస్వామి జాతర సందర్భంగా హుండీ ద్వారా రూ. 21.44 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయ ప్రాంగణంలో జాతర ముగింపు సందర్భాన్ని పురస్క రించుకుని దేవాదయ, ధర్మాదాయశాఖ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం రాజమౌళి ఆధ్వర్యంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. టికెట్ల ద్వారా రూ. 5,01,060 ఆదాయం సమకూరినట్లు ఈవో విక్రమ్ తెలిపారు. ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవాగు వెలవెల

- ఇల్లంతకుంటలో 18 కిలోమీటర్ల మేర ప్రవాహం
- వాగులో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు, రాళ్లు
- ఆక్రమణకు గురవుతున్న వాగు



ఇల్లంతకుంటలోని బిక్కవాగు

ఇల్లంతకుంట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గలగల పారే బిక్కవాగు వెలవెలబోతోంది. నీటి సవ్వడులతో ప్రవహించే వాగు తన దుస్థితిని తలచుకొని విలపిస్తోంది. నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ఆక్రమణలకు గురవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించడంతో రాళ్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలంలో వెంకట్రావుపల్లె, అనంతారం, ఇల్లంతకుంట, రహీంఖాన్‌పేట, వంతడుపుల, నర్సక్కపేట, పొత్తూరు గ్రామాల సమీపంలో దాదాపు 18 కిలోమీటర్లతో బిక్కవాగు ఉంది. గతంలో వర్షాకాలం బిక్కవాగు ప్రవహిస్తే భూగర్భజలాలు పెరిగేవి. సమృద్ధిగా సాగునీరు లభించి పంటలు పండేవి. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. సిద్దిపేట జిల్లా అల్లీపూర్ గుట్టలు, అనంతగిరి గుట్టల సమీపంలో నుంచి నీరు వచ్చి 0.14 టీఎంసీల సామర్థ్యం ఉన్న అనంతారం ప్రాజెక్టు నిండి బిక్కవాగులోకి నీరు వచ్చేది. అనంతగిరి సమీపంలో 3.5 టీఎంసీల సామర్థ్యంతో గత ప్రభుత్వం అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మించడంతో అనంతారం ప్రాజెక్టులోకి నీరు రావడం నిలిచిపోయింది. ప్రభుత్వం నీటిని విడుదల చేసిన సమయంలో మాత్రమే కొద్దిగా నీరు అనంతారం ప్రాజెక్టులోకి వస్తుండడంతో ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు ప్రవహించడం లేదు.



బిక్కవాగులో వేసిన వ్యర్థాలు

● వాగులో వేస్తున్న వ్యర్థాలు

మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది, దుకాణాల యజమానులు బిక్కవాగులో వ్యర్థాలు వేస్తున్నారు. దీంతోవాగు సమీపంలోకి వెళ్తే దుర్గంధం వెదజల్లుతోంది. వాగు సమీపంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగును ఆనుకొని ప్రజలకు తాగునీటిని అందించే బావులు ఉన్నాయి. నీరు తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఇసుక మాయం.. ఆక్రమణల పర్వం

బిక్కవాగులో ఇసుకను తరలించవద్దనే ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా బేఖాతరు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం తో ఇసుకను అక్రమంగా తరలించారు. ప్రస్తుతం వాగులో ఇసుక స్థానంలో రాళ్లు, పిచ్చిమొక్కలు దర్శనం ఇస్తు న్నాయి. మరోవైపు కొంత మంది వాగును ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వాగును పూడ్చి నర్సరీలు, బతుకమ్మల తెప్పల నిర్మాణాలు చేపట్టారు. విశాలంగా ఉండే బిక్కవాగు ప్రస్తుతం చిన్నదిగా కనిపిస్తోంది. శ్మశానవాటికలు ఉనా అనేక మంది వాగులోనే దహనసంస్కారాలు చేస్తున్నారు. ఇలాగే కొద్ది రోజులు ఎవరూ పట్టించుకోకపోతే బిక్కవాగు కనుమరుగయ్యేలా ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని, బిక్కవాగును సంరక్షించాలని రైతులు కోరుతున్నారు.

బిక్కవాగులోకి నీటిని విడుల చేయాలి

- ఒగ్గు నర్సయ్యయాదవ్, మాజీ సర్పంచ్, ఇల్లంతకుంట



రైతులకు ఉపయోగపడే బిక్కవాగులోకి అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేయాలి. అప్పుడే భూగర్భ జలాలు పెరుగుతాయి. గత సంవత్సరం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయాయి. వాగులో వ్యర్థాలను వేయడం నిలిపివేయాలి. వ్యర్థాలు వాగులో వేయడంతో ప్రజలు, పశువులు అనారోగ్యం బారిన పడుతున్నాయి.

బిక్కవాగుకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలి.

ఇసుకను తరలించడంతో దుస్థితి

- కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నర్సక్కపేట



మండలంలోని పలు గ్రామాల సమీపంలో ఉన్న బిక్కవాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించడంతో ఈ దుస్థితికి చేరింది. ప్రసుత్తం వాగులో పిచ్చిమొక్కలు, రాళ్లు మాత్రమే కనిపిస్తున్నాయి. వాగును అధికారులు సర్వే చేయాలి. ఆక్రమణలకు గురయితే స్వాధీనం చేసుకోవాలి. బిక్కవాగుపై ఆధారపడి అనేక మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాపాడాలి.

సింగరేణి సమాచారం

ఆర్‌జీ-1లో 98శాతం బొగ్గు ఉత్పత్తి

- సీఎస్‌పీ నుంచి కోల్ డస్ట్ రాకుండా రూ.2కోట్లతో స్ప్రింక్లర్లు..
- జీఎం లలిత్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

గోదావరిఖని, జనవరి 1(ఆంధ్రజ్యోతి): డిసెంబర్‌లో ఆర్‌జీ-1 ఏరియాలో 98శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆర్‌సీవోఏ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4.51లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 4.41లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 98శాతం లక్ష్యాన్ని ఛేదించిందన్నారు. ఇందులో జీడీకే ఓసీపీ-5 106శాతం, జీడీకే 11ఇంక్లైన్ 89 శాతం, జీడీకే 2,2ఏ ఇంక్లైన్ 44శాతం, జీడీకే 1,3ఇంక్లైన్ 56శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు తెలిపారు. డిసెంబర్ వరకు వార్షిక లక్ష్యం 36.56లక్షల టన్నులకు గాను 32.98లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 90 శాతం లక్ష్యాన్ని ఛేదించినట్టు చెప్పారు. జీడీకే ఓసీపీ-5 లో పర్యావరణం కోసం డీజీఎంఎస్ నిబంధనలకు అనుగుణంగా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్నామని, గత వారం రోజులుగా బ్లాస్టింగ్ తీవ్రత పెరిగిందని తన దృష్టికి వచ్చిందని, దీనిపై అధికారులతో సమీక్షించి బ్లాస్టింగ్ తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. సీఎస్‌పీ-1 వద్ద నిత్యం దుమ్ము లేస్తుండడంతో దాని నివారణ కోసం రూ.2 కోట్ల వ్యయంతో స్ప్రింక్లర్లను ఏర్పాటుచేస్తున్నట్టు, 15రోజుల్లో వీటిని అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. ప్రస్తుతం టెండర్ అయిపోవడంతో తామే రెండు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి దుమ్ము లేవకుండా నీటిని స్ప్రే చేయిస్తున్నామని తెలిపారు. దుమ్ముతో సీఎస్‌పీ కాలనీ, బాపూజీనగర్, జీఎం కాలనీలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందని, దీని నివారణ కోసం త్వరలో చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. కర్ణాటకలోని ఎన్‌టీపీసీ కుడికి ప్రాజెక్టుకు వెళ్లే బొగ్గు నాణ్యతపై దృష్టి సారించినట్టు, అందులో నాసిరకం బొగ్గును రవాణా చేస్తున్నట్టు వస్తున్న ఆరోపణలు నిజం కాదని, సీఎస్‌పీ నుంచి బొగ్గు రవాణా అయిన తరువాత ఎన్‌టీపీసీ యాజమాన్యానికే సంబంధం ఉంటుందని, వారే ర్యాకుల ద్వారా బొగ్గు రవాణా చేసుకుంటున్నారని చెప్పారు. ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషితోనే ఆర్‌జీ-1లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తున్నామన్నారు. కార్మికులు, ఉద్యోగులకు మౌలిక సదుపాయాల కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు జీఎం తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజనీర్ వెంకటేశ్వర్‌రావు, ప్రాజెక్టు ఆఫీసర్ చంద్రశేఖర్, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్‌సెక్రటరీ ఆరెల్లి పోషం తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఉత్పత్తి 81 శాతం..

- జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గడిచిన డిసెంబరు నెలలో ఆర్జీ-2 ఏరియా 82 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు ఏరియా జనరల్ మేనేజర్ బండి వెంకయ్య తెలిపారు. బుధవారం జీఎం ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏరియా ఉత్పత్తి వివరాలను తెలియజేశారు. డిసెంబరు నెల ఉత్పత్తి లక్ష్యం 10,81,600 టన్నులు కాగా 8,74,749 టన్నులు (89శాతం) సాధించినట్టు తెలిపారు. ఓబీ వెలికితీత లక్ష్యం 62,00,000 క్యూబిక్ మీటర్లు కాగా 52,16,029 క్యూబిక్ మీటర్లు వెలికితీసినట్టు(84శాతం) జీఎం పేర్కొన్నారు. సీహెచ్‌పీ నుంచి 7,16,030 టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 66,49,600 టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 63,36,826(95శాతం) టన్నులు ఉత్పత్తి జరిగినట్టు జీఎం వెంకటయ్య తెలిపారు. రానున్న మూడు నెలల్లో వంద శాతం ఉత్పత్తి సాధించే దిశగా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని జీఎం కోరారు. ఓసీపీ-3కి చెందిన ఆఫ్ లోడింగ్ టెండర్ పూర్తయి ఓబీ వెలికితీత పనులు ఆలస్యం అయిన కారణంగా బొగ్గు ఉత్పత్తికి ఆటకం ఏర్పడినట్టు జీఎం తెలిపారు. సీహెచ్‌పీలో ఒక బంకర్ ఆధునికీకరణ పనులు జరుగుతున్న దృష్ట్యా, ఒకే బంకర్ ద్వారా బొగ్గు రవాణా చేయాల్సి వస్తున్నట్టు తెలిపారు. ఆర్జీ-2 ఏరియా వార్షిక లక్ష్యాలను సాధిస్తూ వస్తున్న ఒరవడిని కొనసాగిస్తూ ఈ సంవత్సరం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ-2 జీఎం వెంకటయ్య

కూడా లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళికా ప్రకారం వెళుతున్నట్టు జీఎం తెలిపారు. ఉద్యోగులు, కార్మిక సంఘాలు తమ వంతు సహకారాన్ని అందించాలని జీఎం వెంకటయ్య కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఏరియా ఇంజనీర్ నరసింహారావు, ఎస్వోటూ జీఎం రాముడు, వీకేపీ ప్రాజెక్టు ఏజంట్ నెహ్రూ, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు ఎర్రన్న, మురళీకృష్ణ, డాక్టర్ మహిపాల్, వెంకటరామచంద్ర, షరీఫ్ మహమ్మద్, వినయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే లక్ష్యాల సాధన..

- ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు

రామగిరి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటున్నామని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రామగిరి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వార్షిక, మాసాంతపు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. సింగరేణి ఆర్జీ-3 డివిజన్‌కు నిర్దేశించిన వార్షిక ఉత్పత్తిలో 45.11లక్షల టన్నులకు 44.10 లక్షల ఉత్పత్తిని (98 శాతం) సాధించిందన్నారు. మాసాంతపు ఉత్పత్తిలో డివిజన్‌కు నిర్దేశించిన 5.78 లక్షలకు గాను 5.77 లక్షల(100 శాతం) బొగ్గు ఉత్పత్తిని సాధించామని పేర్కొన్నారు.

అదేవిధంగా ఏపీఏ డివిజన్‌లో వార్షిక ఉత్పత్తిలో 3.55 లక్షల టన్నులకు 3.71లక్షల టన్నులు (105 శాతం)సాధించిందన్నారు. అదే మాసాంతపు ఉత్పత్తిలో 0.09 లక్షల టన్నుల నిర్దేశిత లక్ష్యానికి 0.13 లక్షలు (105 శాతం) సాధించిందన్నారు. గత సంవత్సరంలో సింగరేణి సేవా కార్యక్రమాలతో పాటు కార్మికుల కుటుంబాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. సెంటినరీకాలనీ వ్యాపార, వాణిజ్య సంస్థల అభివృద్ధికి సైతం కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్మిక కుటుంబాలకు, పరిసర ప్రాంతాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాల కోసం ఇదే ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఈ సమావేశంలో అధికారులు రఘుపతి, శేఖర్ బాబు, యాదయ్య, వెంకటరమణ, రామ్మోహన్, చంద్రశేఖర్, సుదర్శనం, సునీల్‌ప్రసాద్, రాజేశం, కోఆర్డినేటర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి



సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ-2 జీఎం వెంకటయ్య అన్నారు. బుధవారం సెక్యూరిటీ విభాగం డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద సెక్యూరిటీ సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది విధులు, క్రమశిక్షణ, ఆస్తుల పరిరక్షణ విషయాలపై జీఎం సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల వద్ద కోల్ ట్రాన్స్‌పోర్టు, సీహెచ్‌పీ వద్ద గనుల వద్ద చెక్‌పోస్టుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓసీపీ-3 ప్రాజెక్టు, స్టోర్‌వంటి వాటిలో చోరీలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఏదైనా యంత్ర భాగాలు, కేబుల్ వంటివి అపహరణకు గురైతే యంత్రాలు నిలిచిపోయి ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. ఈసమావేశంలో ఎస్వోటూ జీఎం రాముడు, ఎస్ఎస్ఓ షరీఫ్‌మహమ్మద్, జమెదార్లు సంపత్, విజయ్ కుమార్, అబ్దుల్ మజీద్‌తో పాటు ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఉద్యోగులకు ప్రమోషన్లు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో పని చేస్తున్న 56మంది ఉద్యోగులు ఎస్ఎల్‌పీ(సర్వీస్డ్ లింక్‌డ్ ప్రమోషన్)కు అర్హత సాధించారు. బుధవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో ఉద్యోగులకు జీఎం బండి వెంకటయ్య ప్రమోషన్ పత్రాలను ఉద్యోగులకు అందజేశారు. ఓసీపీ-3 ఉత్పత్తికి ఎదురవుతున్న సవాళ్ళను అధిగమిస్తూ వార్షిక లక్ష్యాలను సాధించే దిశగా ఉద్యోగులు శ్రమించాలని జీఎం కోరారు. పని గంటలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్‌సెక్రెటరీ జీ రవీందర్, పీఓ మదుసూధన్, ఎస్వోటూ జీఎం రాముడు, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, మేనేజర్ భరత్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

పనివేళల మార్పు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనివేళల మార్పు నిర్ణయాన్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని కోరుతూ ఓసీపీ-1లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. అనంతరం ప్రాజెక్టు పీవో, మేనేజర్‌లకు వినతిపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి మాట్లాడారు. ప్రస్తుత పని వేళల్లో మార్పు చేయాలని యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని ఐఎన్‌టీయూసీ వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. అందరికీ అనుకూలంగా ఉన్న పనివేళలను మార్చడం ద్వారా కార్మికుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, ఉత్పత్తిపై ప్రభావం చూపే అవకాశం సైతం ఉన్నట్టు పేర్కొన్నారు. యాజమాన్యం పునరాలోచించి పని వేళలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పిట్ సెక్రెటరీ వెంకటస్వామి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్, సంజీవయ్య, కనకసేనారెడ్డి, బాలాంకుస్, రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, సాంబయ్య ఉన్నారు.

మార్కెట్ కమిటీల నియామకమెప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

ఉంటే వారు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియామకం కానున్నారు. అయితే మార్కెట్ కమిటీల నియామకాలు జాప్యం జరుగుతుండడంతో అధికార పార్టీకి చెందిన నాయకులు కొంత అసంతృప్తికి గురవుతున్నారు. జిల్లాలో అన్ని మార్కెట్ కమిటీల పాలకవర్గాలు పూర్తి కాగా, కేవలం మంథని, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇవి ఎప్పుడు పూర్తవుతాయా అని ఆశావాహులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. అయితే వారం, పది రోజుల్లో ఈ రెండు మార్కెట్ కమిటీలను మంత్రి కసరత్తు చేస్తున్నారని తెలిసింది.

మాజీ మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



కొప్పుల ఈశ్వర్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మండల బీఆర్ఎస్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కూరపాటి శ్రీనివాస్, దేవి నళినికాంత్, దేవి వంశీలు కరీంనగర్‌లోని ఆయన గృహంలో కొప్పులను కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యాన్నదానం నిర్వాహకులకు సన్మానం

సుల్తానాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ అభయాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం నిర్వాహకులు సాయిరి పద్మ-మహేందర్‌లను బుధవారం పలువురు సన్మానించారు. వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వారి సేవలను కొనియాడారు. గురువారంతో అన్నదాన సేవలు ఈ ఏడాదికి ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన రాజేశ్వర్‌రావు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్‌ను బుధవారం కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు చెప్యాల రాజేశ్వర్‌రావు ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో కలిశారు. కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీ సీట్లు సాధించేందుకు కృషి చేయాలని కేసీఆర్ సూచించారని రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

పర్వతాల మల్లన్నకు రూ.50 వేల విరాళం

ధర్మారం జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పర్వతాల మల్లికార్జున స్వామి దేవాలయానికి కొత్తపల్లి గ్రామానికి చెందిన చేపల వ్యాపారి బొల్లి లక్ష్మి-రాములు దంపతులు 50,116 రూపాయల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవుల రాజేశం, తుమ్మల రాంబాబు, ఒడ్నాల శంకరయ్యతో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం కార్యవర్గం

ధర్మారం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రచ్చపల్లి మాజీ సర్పంచ్ మోర సుధాకర్ ఆధ్వర్యంలో సాంబమూర్తి పద్మశాలి సేవా సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెరుగు రాజేశం, ఉపాధ్యక్షుడిగా గుండా రవి, ప్రధాన కార్యదర్శులుగా మెరుగు శంకరయ్య, బైరి మహేష్, కోశాధికారిగా మెరుగు సాగర్, ప్రచార కార్యదర్శి మెరుగు వెంకటేశం, కమిటి సభ్యులుగా ఎనగందుల పోచాలు, మెరుగు రాయమల్లు, మెరుగు శంకరయ్య, మేరు గట్టయ్య, బైరి చంద్రయ్య, లస్మయ్య, లక్ష్మన్, రాములు, గట్టయ్య, శంకరయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాజేశం మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మోర సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధి కోసం శాయశకులా కృషి చేస్తానని అన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మంథని, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణంలోని, మండలంలోని మల్లారం గ్రామంలో ఇటీవల మృతిచెందిన పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. మంథనిలో సుభాష్‌నగర్‌లో కేశెట్టి వైకుంఠం, మాచీడి రాజయ్య, మల్లారంలో ఇనుముల నరేష్‌లు మృతిచెందగా వారి మృతిపై పుట్ట మధు విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడితో శబరిమలకు బయలుదేరిన దీక్షాపరులు

మంథని, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి దీక్షలో ఉన్న స్వాములు స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి గురుస్వామి ద్వారా ఇరుముడిని స్వీకరించి శబరిమలకు బుధవారం బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి శరుణఘోషతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఈ కార్యక్రమంలో వొడ్నాల శ్రీనివాస్, సహేందర్, రాచర్ల రమేష్, నార్ల భాస్కర్, రాజు, సర్వేష్, కిరణ్, ఎల్లంకి వంశీ, భక్తులు పాల్గొన్నారు.

ఇన్‌కం ట్యాక్స్ రద్దు చేయాలి

మందమర్రిటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సొంతింటి కలను అమలు చేయాలని, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్‌ను సంస్థ రద్దు చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, అల్లి రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడారు. ఈ విషయమై మూడు వారాలుగా సింగరేణి వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టామన్నారు.

రామగుండం ప్రాంతంలో నాసిరకం బీర్ల విక్రయాలు

- నిలదీసిన కొనుగోలుదారులు

కోల్‌సిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పలు మద్యంషాపుల్లో నాసిరకం బీర్లను విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ బీర్లలో ప్రాణాంతకమైన ఫంగస్, ఇతర వ్యర్థాలు ఉండడం మద్యం కొనుగోలుదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. వారం రోజుల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రెండుచోట్ల ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కొందరు వ్యక్తులు ఊర్వశి థియేటర్ సమీపంలోని మద్యం షాపులో బ్రాండెండ్ బీర్లను కొనుగోలు చేశారు. వాటిని సేవిస్తుండగా దుర్వాసన రావడంతో ఆందోళనకు గురయ్యారు. పరిశీలించగా బీర్లలో టిష్యూ పేపర్లు, ఇతర ఫంగస్ కనిపించాయి. దీంతో ఆగ్రహం చెందిన మద్యం కొనుగోలు దారులు వైన్‌షాపు నిర్వాహకులను నిలదీశారు. తమదేమి తప్పులేదని, మంచిర్యాలలోని ప్రభుత్వ బ్రెవరీస్ గోడౌన్ నుంచే కొనుగోలు చేశామన్నారు.

ఫంగస్ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

- ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మంగ

గోదావరిఖని పలు మద్యం దుకాణాల్లో బీర్లలో ఫంగస్ వచ్చిన విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. బీర్లను రేషన్ ప్రకారమే ఇస్తున్నాం. ఎక్కడా కూడా నిల్వలు లేవు.

నూతన సంవత్సరంలో మండలం మరింత అభివృద్ధి..

ముత్తారం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో మండలం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పనులను చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారన్నారు. ఈ సంక్రాంతి నుంచి రైతన్నలకు పూర్తిస్థాయిలో అన్ని పథకాలను, అర్హులకు ఇందిరమ్మ ఇల్లు, ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను కింది స్థాయి నుంచి అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయనున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

